# మట్టి తెలుగింటి

సూరి పండు



రాత్రి, పదిగంటలవుతోంది. పడమర దిశన పూరిపాకల వెనక తల నిక్కబొడుచుకు నిలుచున్న తాటి చెట్లకొమ్మల చాటుగా దిగజారిపోతున్నాడు చందురుడు. ఊరికి నడిబొడ్డులో నన్ను మించిన వాడెవడూ లేనట్టు మిడిసిపాటుగా రొమ్మిరుచుకొని నిలబడే రౌడీ రామిగాడిలా కొమ్మలు సాచుకొని నిలబడిన పెద్ద రావి చెట్టు ఆకులు గాలికి గలగలా సద్దు చేస్తున్నాయి, గోదావరీ అలల్లా.

ఆ చెట్టు చుట్టూ మట్టితో కట్టిన రచ్చ బండమీద రాజాలా కూర్చుని ఉన్నాడు గూడెం పెద్ద కొండప్ప. పేరుకు తగ్గట్టే కొండలాంటి మనిషి. కండలున్న మనిషి. గుండెలున్న మనిషి. వయసుడుగుతున్నా పొగరు తగ్గని మీసకట్టు. కాపు సారా ఆరారగా త్రాగే అలవాటు వల్ల ఎప్పుడూ ఎరువు తగ్గని కళ్ళు... పెద్దపులి కళ్ళల్లా! రెండు

చేతులూ వెనక్కి ఆన్చి... చెట్టుకొమ్మల్లోంచి తొంగి చూసే నక్షత్రాల కాంతులొంక రెప్పలెయ్యకుండా చూస్తున్నాడు..... ఆలోచన చేస్తున్నట్టు. అతనికి ఆ పక్కా ఈ పక్కా అయిదారుగురు కూర్చుని ఉన్నారు, ఆ గూడెం పెద్ద లెక్కల్లో కొంచెం పెద్దోళ్ళు అన్పించుకున్న వాళ్ళు. వాళ్ళు కూడా ఆలోచనా సముద్రంలోనే మునిగి తేలుతున్నారు.

ఆ రచ్చ బండ ముందు ఒక ప్రక్కనో పాతికేళ్ళ పడుచుతనంతో, చూసేవాళ్ళ కళ్ళల్లో సురుక్కుమనిపించే సూది ముక్కుతో, కసక్కన కత్తిలా గుండెల్లో దూసుకుపోయే కోరమీసంతో, ఆవేశంతో ఊగిపోతున్నట్టు నిలబడున్నాడు పోలిగాడు, బలిష్ఠమైన ఛాతీ ఎగసెగసిపడుతోంది.

అదుగో... ఆ కండలు తిరిగిన ఒళ్ళు... ముఖం మీద ముచ్చటగా ఎగిరిపడే ఉంగరాల జుట్టు... మంకెన పువ్వుల్లా ఉండే ఆ పెద్ద పెద్ద కళ్ళు చూసికదూ మల్లి ఆడ్ని తప్ప మరో మగాణ్ణి మనువాడనని మంకుపట్టు పట్టింది.

కోపంతో రుసరుసలాడుతూ నిల్చున్న పోలిగాడి వంక జాలిగా చూస్తూ నిలబడి ఉంది రచ్చబండకి మరో ప్రక్కన పోలిగాడి పెళ్ళాం మల్లి. నీలి మబ్బు కన్నెగా మారినట్టుంటుంది ఆ పిల్ల. ప్రేమించిందే కొలిమిల్లాంటి తెల్లని కళ్ళు ఆమె నల్లని ముఖంలో మెరుస్తూ ఉంటాయి. కసికసిగా కోర్కెలు పుట్టించే పెదాలు, చేతిలోకి అమిరిపోయేట్టు సన్నని నడుము, మెలికలు తిరిగిపోయే పాములా నున్నగా మెరిసిపోతూ. అవి కలిగించే మత్తుకే లొంగిపోయాడు అంత లావాటి మగాడు పోలిగాడు. మల్లి ప్రక్కనే ఆమె తల్లి



రావులమ్మ చేతిలో పొత్తిళ్ళలో పసిబిడ్డ. వెచ్చగా నిద్రపోతున్నాడు అక్కడ జరుగుతున్న తతంగంతో తనకేం సంబంధం లేనట్టు.

అక్కడ జరుగుతున్న ఆ పంచాయితీకి ముఖ్య కారకుడు ఆ పసిబిడ్డే! వాణ్ణి మూణ్ణెల్ల క్రితం కన్నది మల్లి. ఏడాది క్రితమే ఎవరో ఎరుగున్న కంట్రాక్టరు పంపితే దుబాయ్ వెళ్ళిపోయాడు పోలిగాడు డ్రైవరుగా. అక్కడుండంగానే అందింది "మావా! మనకో పండంటి బాబు పుట్టాడు" అని మల్లి రాయించిన ఉత్తరం. అప్పటికే యిద్దరాడ పిల్లల తండ్రయిన పోలిగాడు తన వాళ్ళెవళ్ళకి ఇష్టం లేకపోయినా, తను ప్రాణమిచ్చే మల్లి ఆరోగ్యం చెడిపోకూడదని తానే ఆపరేషన్ చేయించుకున్నాడు. "మరి... మరిదేంటి. మల్లికి గాని మతి పోయిందా. ఉత్తరం రాసిన ఆచారి మాట్టారి కళ్ళద్దాలు మందగించాయా" అనుకుంటూ అగ్గిలం మీద గుగ్గిలంలా మండిపడ్డాడు అక్కణ్ణుంచే. జరక్కూడనిదేదో జరిగిపోయిందనుకున్నాడు. అంతే... హడావుడిగా బయల్దేరి వచ్చాడు. వచ్చిందే తడవుగా మల్లి మీద పడి చంపినంత పనిచేశాడు. అందరూ వాణ్ణి పట్టుకొని ఆపకుంటే అంత పనీ జరిగిపోయేది. "నేను లేకుండా చూసి ఎవడితో కులికావో ఆడితోటే పోయె. ఈ కుర్రనా కొడుకు ఎవడికి పుట్టాడో ఆడికాడికేపో. నీకు నాకు యికనుంచి ఏటి సంబంధం లేదు. నిన్నొగ్గేసి పోతన్నా" కరాకండిగా చెప్పేశాడు పోలిగాడు.


అదిరిపడింది ఆడిమాటలకి మల్లి "ఏంటి మావా నువ్వంటున్నది. నాను ఎవుడితోనో కులికానా. నువ్వేనా ఆ మాటలన్నది. నువ్వంటే నాకు పేనం అన్న సంగతి నీకెరుకకాదా. నిన్ను తప్ప ఆ భగవంతుణ్ణి కూడా తలుసుకోనని నీకు తెలవదా మావా. ఈడు నీ బిడ్డే మావా. సత్తెపెమాణికంగా సెప్తన్నాను. నేనే పాపం ఎరుగను మావా" ఆమె కళ్ళు కట్టతెగిన చెరువులే అయ్యాయి. పోలిగాడి కాళ్ళు పట్టుకొని దీనంగా వాడికేసి చూస్తోంది మల్లి.

విసురుగా ఆమెని తోసేసాడు పోలిగాడు "ఛస్. నోర్మూసుకోయే. ఏడాదికితమనగానే నేనాపరేసను చేయించుకున్నానని మర్చిపోయావా. ఇంక నాకెట్టాగ పుడ్తాడే పిల్లాడు. దొంగయాసికాలెయ్యమాక్. నెత్తిమీదెట్టుకొని సూసుకొన్నానుగదే నిన్ను. తగిన శాస్తి సేసావులేయే...." కోపంతో నిప్పులు కురుస్తున్నట్టుగా ఎర్రగా ఉన్నాయి పోలిగాడి కళ్ళు.

వెనక్కి పడ్డ మల్లి పైకి లేచింది. "మావా... నా మాట నమ్ము. నా బిడ్డల మీద పెమాణం సేసి సెప్తున్నాను. ఈ బిడ్డకి అయ్యవు నువ్వే మావా. ఈడిముఖం సూడు సందమామలా... అచ్చం నీముఖం కాదూ! ఆడి కళ్ళు సూడు మావా... కప్పూరంగుళ్ళలా తెల్లగా మెరవట్లేదు... అయి నీ కళ్ళు కాదూ! సూడు మావా... ఆడ్ని ఒక్కసారి నీ

## అర్థం కావడం లేదు

అసలు నేనెందుకు ఎవరికైనా భయపడాలి? తప్పు చేస్తే భయపడతారు. నేరం చేస్తే భయపడతారు. పోనీ ఒకరికి ద్రోహం చేస్తే భయపడతారు. అరె! నా పని నేను చేసుకుంటూ నా తిండి నేను తింటూ ఒకరికి భయపడటం దేనికండీ అసహ్యంగానూ అంటాడు ప్రకాష్‌రాజ్. నేను ఎవరికీ భయపడవలసిన అవసరం లేదు. అప్పుడప్పుడూ తన నోటికి భయపడితే చాలు! అంటాడు.



## పాపం వదిలెయ్యండి

'మహిమ'కి, నాకూ మంచి ఫ్రెండ్షిప్ తప్ప ఇంకేం లేదు అంటున్నాడు సునీల్‌శెట్టి. ఏవుందో లేదో



మహిమకి మగవాళ్ళతో ఆడుకోవడం మాత్రం తెలుసు, అందుకే అందరు మగవాళ్ళు ఆమెను లైక్ చేస్తారు. నేనూ అలాగే లైక్ చేస్తున్నాను. ఆమె 'లియాండర్'తో హేపీగా వుంటుంది కదా పాపం! వొదిలెయ్యండి' అంటున్నాడు సునీల్‌శెట్టి. ( ఇంతకీ లింకు వుందని చెప్పడమా? లేదని చెప్పడమా?)

గుండెకత్తుకో మావా. ఆ గుండె సప్పుడు యినుకో మావా. నీ గుండె సప్పుడులా ఇనిపిస్తది. సల్లగంధం రాసుకున్నట్టుంటాది. ఆణ్ణి ఎత్తుకొని సూడు మావా! ఇంకేటి సెప్పి నిన్ను నమ్మించలగను. సెప్పు మావా.. సెప్పు" అంటూ ఆ పసిగుడ్డును పోలిగాడి కాళ్ళముందు పెట్టి కుప్పకూలిపోయింది మల్లి ఏడుస్తూ.

ఎవ్వరెన్నివిధాలుగా నచ్చచెప్పి చూచినా వినకపోవడంతో గూడెం పెద్దల మధ్య పంచాయితీలోకి మారింది. ఇప్పుడక్కడ జరుగుతున్న పంచాయితీ అదే. ఇటు "దాని వొయ్యారం సెడిపోకూడదనేగందా మన వోల్లెవరు యిట్టపడని పని చేసి... నేను ఆపరేషన్ చేయించుకున్నది. మరిదిట్టాగసెయ్యడం నాయంగా ఉందా. నానెల్లేప్పుడికి లేని గర్భం, ఏ తప్పు సెయ్యకపోతే అద్వాంతరంగా ఏడనుంచైనా వొస్తదా, పేనానికి పేనంగా ప్రేమించి పెళ్ళి సేసుకున్న నాకు అన్యాయం సెయ్యడం నాయంగా ఉందా? నేను దేశం కాని దేశం ఎల్లినానంటే ఎవరి కోసం. దానికోసరం, దాని బిడ్డలకోసరమేగందా. మరి గదిట్టాగ సెయ్యడం నాయమేనా సెప్పండి" అన్న పోలిగాడి మాటలు విన్నారు పెద్దలు. అటు "అయ్యా ఆణ్ణి పెల్లి సేసుకోవటానికీల్లేదని మా అయ్య గొడవ బెడితే నానెల్లా ఏడిచి మొత్తుకొని ఉపోసాలుండి యీణ్ణి మనువాడానో మీకు యెరికనే కదా. ఆడు నేను కలిసి ఎట్టా బతికామో మీకు ఎరికనే కదా - అసువంటిది మాకోసరం ఏ దేశమో కట్టానికి పోయినోడికి అన్నాయం సేస్తానా సెప్పండి బాబూ. నేనట్టాంటి పనులు సేసే మడిసిని కాదని మీకు తెలవదా బాబూ. ఆడెల్లే నాటికే నేను నెల తప్పాను. అది నిజమేననుకొనే పాటికి యీడు పట్నమెల్లిపోయాడు. ఆడెల్లిన సాన్నాళగ్గాని ఆడికాడనుంచి ఉత్తరం రాలేదు. ఈయి సమస్యలన్నీ ఆడికెట్టా సెప్పాలి సెప్పండి. నాను తప్పు సెయ్యలేదని ఎట్టా బాబూ నిరూపించుకొనేది. అగ్గిలో దూకమంటే దూకుతాను. ఆ పసిగుడ్డుమీద పెమానకంగా సెప్తున్నాను. నానే పాపం ఎరుగను" అన్న మల్లి మాటల్నీ ఇన్నారు పంచాయితీ పెద్దలు.

తీరుపేమని చెప్పాలో తెలియని సందిగ్ధ పరిస్థితుల్లో ఆలోచనలో మునిగిపోయారు. ఇద్దరూ ఎరుగున్న వాళ్ళుగావడం మూలాన ఎవర్ని దోషులుగా తీర్మానించాలో అర్థంకాని సంకటస్థితిలో పడ్డారు.

ఒక్కసారిగా అక్కడ చేరిన వాళ్ళలో కలకలం రేగింది. "డాక్టరు బాబు... డాక్టరు బాబు.." అంటూ. తిన్నెమీదున్న పెద్దలు కూడా లేవబోయారు. చిరునవ్వుతోనే అందర్నీ పలకరిస్తూ గూడెం పెద్దల ముందుకు వచ్చాడు డాక్టర్ మూర్తి. "ఇప్పుడెందుకు వచ్చారో డాక్టర్ బాబు.." ఎవరికి వారే అనుకున్నారు.

"కొండప్పా!" సౌమ్యంగా విన్పించింది డాక్టర్ మూర్తి కంఠం. "మీ కులాచారాల్లోను, గూడెం కట్టుబాట్లలోను తలదూరుస్తున్నాననుకోకపోతే... మీ సమస్యని నేను పరిష్కరిస్తాను" అన్నాడు. గుండెలపై పెద్ద బరువు తొలగిపోయినట్లుగా డాక్టర్ మూర్తి వంక చూశాడు కొండప్ప.

"డాట్రు బాబు... మీరు సదూకున్న మారాజులు. మీరు నాయం సేస్తానంటే మాక్కావల్సిందేటి బాబూ" అన్నాడు.

చిరునవ్వుతో అతనికి కృతజ్ఞతలు చెప్పి పోలిగాడివైపు నడిచాడు డాక్టర్ మూర్తి.

"చూడు పోలయ్యా... ఈ మల్లి అంటె నీకెంత ప్రేమో నాకు తెలుసు. ఆ మల్లికి నువ్వే ప్రాణమన్న సంగతి నాకు తెలుసు. నువ్వు ఆపరేషన్ చేయించుకున్నపుడు నేనే కదా దగ్గరున్నది. మరీ బాబెలా పుట్టాడనేది నీ సందేహం. నీ అనుమానం పటాపంచలు చేసే చిన్న విషయం. నువ్వు మర్చిపోయినది నేను గుర్తు చేస్తాను. నువ్వు ఆపరేషన్ చేయించుకున్న రోజున వేలి ముద్ర వేస్తూ "డాట్రు బాబూ.... ఈ కాగితంలో ఏంటుంది.." అనడిగావు. అప్పుడు చెప్పినమాటలు గుర్తు చేసుకో. "ఒకవేళ ఆపరేషన్ ఫెయిలయి పిల్లలు పుడితే గవర్నమెంటు బాధ్యత వహించదు. అందుకు నువ్వు అంగీకరిస్తున్నా" వని రాసుంటుంది అని చెప్పాడు.

అంటే ఒక్కోసారి ఫెయిలయ్యే అవకాశాలున్నాయనే కదా ప్రభుత్వం అలా జాగ్రత్త పడేది. నీ విషయంలో అలాగే జరిగింది. అంతేకాని మల్లి ఏ తప్పు చేయలేదురా. పోలయ్యా! భార్య భర్తల మధ్యన ఉండవల్సింది ప్రేమానురాగాలే కాదురా... నమ్మకం కూడా! నిన్నే గుండెల్లో పెట్టుకొని బ్రతుకుతున్న మల్లి నీకెలా అన్యాయం చేస్తుందిరా. ఆ బిడ్డ నీ బిడ్డే. నీకు నమ్మకం కల్గించే పరీక్షలు వైద్యశాస్త్రంలో లేకపోలేదు. కావాలంటే చేయిస్తాను. వీడు నీ కొడుకే అని ఋజువు చేస్తాను. సరేనా" తన సుదీర్ఘోపన్యాసాన్ని ముగించాడు డాక్టర్ మూర్తి.

తన తప్పు తెల్సుకున్న వాడిలా ఆయన పాదాలముందు వాలిపోయాడు పోలిగాడు. పశ్చాత్తాపంతో కళ్ళు కాలవలవుతున్నాయి. "డాట్రు బాబు నన్ను సెమించండి. అనుమాన పిశాచి నా కళ్ళు కప్పేసినాది" అన్నాడు.

చిరునవ్వుతో వాణ్ణి పైకి లేవదీసి "అదిగో... అదిరా క్షమించవల్సింది ఆ బిడ్డణ్ణి ఎత్తుకొని గుండెలకత్తుకో. మంచి ముత్యాల దండలుగాని, కర్పూరంగాని, మంచి గంధంగాని, పున్నమివెన్నెల కాని యివ్వలేని చల్లదనం ఉంటుందిరా ఆ బిడ్డ కౌగిలిలో"' అన్నాడు డాక్టరు మూర్తి.

ఒక్క అంగలో మల్లిని చేరుకున్నాడు. ఒక చేత్తో ఆమెని దగ్గరకు లాక్కుంటూ... మరోచేత్తో రావలమ్మ చేతుల్లోని బిడ్డణ్ణి బలంగా లాక్కుని గుండెల కదుముకున్నాడు పోలిగాడు.

ఆ అదురుకి నిదురపోతున్న బిడ్డడు "కెవ్వు" మన్నాడు. మబ్బు తొలగిన చంద్రుడిలా వెలిగిపోయింది ముఖం. ❃